క్లుప్తంగా

ఖాదర్‌లింగ స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఖాదర్‌లింగ స్వామి సమాధి

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

శాంతిమార్గంతోనే సమసమాజ స్థాపన

కౌతాళం: శాంతిమార్గంతోనే సమాజస్థాపన జరుగుతుందని బసవలింగ మహాస్వామి, శివమూర్తి శాస్త్రి అన్నారు. మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో వెలసిన తోంటదార్యమ 78వ ఆరాధన ఉత్సవాలు (జాతర) వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 5న జాతర మహోత్సవం ఉంటుంది. ఫిబ్రవరి 2 5నుంచి ప్రారంభం అయిన జడేసిద్ధేశ్వర శియోగి జీవనదర్శనం పురాణ ప్రవచనంలో భాగంగా గురువారం ఉత్తరాధికారి బసవలింగ మహాస్వామి ఆశీస్సులతో భక్తులకు కళ్లకు కట్టినట్లు సంప్రదాయ దుస్తులతో వధూవరులకు (బొమ్మలకు) పట్టువస్త్రాలు తొడిగిఅంగరంగ వైభవంగా పెళ్లి ఘట్టన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల గ్రామాల్లో శాంతి, సోదరభావం ఏర్పడుతుందన్నారు. అందరూ కలిసిమెలసి శాంతి మార్గాన్ని అవలంభించాలన్నారు. పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ నైపుణం పెంచుకోవాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఆర్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ డి.గోపీనాథ్

ఆదోని సెంట్రల్: విద్యార్థులు ఉద్యోగ మెలకువలు, నైపుణ్యం పెంచుకోవాలని ఆర్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ డి.గోపీనాథ్ (ముంబై) తెలిపారు. గురువారం పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. కరెన్సీ మారకపు విలువ, తదితర అంశాలను వివరించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చేతి రాత ఆకట్టుకునేలా ఉండాలి



విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ఆకట్టుకునే విధంగా చేతి రాత ఉండాలని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద్ సూచించారు. గురువారం పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో అరసం ఆధ్వర్యంలో విద్యార్థులకు సుందర దస్తూరి పోటీలు, పద్య రచన పోటీలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులలో మంచి చేతి రాతను అలవర్చడం కోసం ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. పోటీలలో 70 మంది విద్యార్థులు పాల్గొనగా 25 మంది విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలీం సిద్దిఖీ చేతులు మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు సువర్ణ, కోటన్న, లోక్యానాయక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



బోయ పెద్ద నాగప్ప (ఫైల్)

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణానికి చెందిన బోయ పెద్ద నాగప్ప (77) రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. గురువారం సాయంత్రం ఇస్వీ ఆర్‌ఎస్ లైన్ ట్రాక్ మధ్య కి.మీ నంబర్ 495/34-36 వద్ద డౌన్‌లైన్ ట్రాక్ నల్లగేట్ వద్ద పెద్ద నాగప్ప రైల్వే ట్రాక్ దాటుతుండగా డీడీఎల్/హెచ్‌టీపీపీ రన్నింగ్ గూడ్స్ ఢీకొట్టింది. దీంతో రెండు కాళ్లు విరిగి, తల, చేతులకు బలమైన గాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. వయస్సు మీద పడడంతో చెవులు వినపడక ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసిందని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు

- ఆదోని నియోజకవర్గంలో 875 మంది రెగ్యులర్ ఉద్యోగులు
- 1025 మంది వలంటీర్ల నియామకం
- నియోజకవర్గంలో మొత్తం 1900 మంది కుటుంబాలకు మేలు చేసిన ప్రభుత్వం





ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు (ఫైల్), ఆదోనిలో వలంటీర్లకు సూచనలు చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఆదోనిఅర్బన్: ప్రజల వద్దకే పాలన అందించాలనే లక్ష్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఎంతోమంది నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు నింపింది. ఏళ్ల తరబడి నోటిఫికేషన్ల కోసం వేచి చూసిన నిరుద్యోగులకు కొలువులను తెచ్చి పెట్టింది. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా రాత్రింబవళ్లు కష్టపడి చదువుకున్న వారికి ప్రతిభ ఆధారంగా ఉన్నత ఉద్యోగం కల్పించింది.

రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం తెచ్చేందుకు ము ఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. వీటి నుంచి ప్రజలకు సేవలందించేందుకు ఉద్యోగుల్ని నియమి ంచారు. ఈ ప్రక్రియ పక్కాగా ఉండాలన్న లక్ష్యంతో ఏపీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ జారీ చేసి పారదర్శకంగా భర్తీ చేశారు. ఒక్కో సచివాలయంలో సుమా రు 12 శాఖల సిబ్బందిని నియమించడంతో పాటు అనుసంధానంగా వలంటీర్ వ్యవస్థను తీసుకురావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ విప్లవం సాధ్యమ య్యింది. ఆదోని నియోజకవర్గంలో 1900 మంది కుటుంబాల్లో వెలుగులు నింపిన జగనన్నకు రు ణపడి ఉన్నామంటున్నాయి ఉద్యోగుల కుటుంబాలు.

ఇంటికో ఉద్యోగం పేరుతో టీడీపీ మోసం

2014 ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు ఎత్తులు వేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిరుద్యోగులకు ఆచరణ కాని హామీలను ఇచ్చారు. జాబు రావాలంటే బాబు రావాలి, ఇంటికో ఉద్యోగమిస్తామని పదేపదే చెప్పారు. ఇది నమ్మి టీడీపీకి ఓటు వేసిన నిరుద్యోగులు నట్టేట ముని గారు. ఇంటికో ఉద్యోగం కాదు కదా కనీసం ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారు. దీంతో ఆయన హయాంలో నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసిన యువత రోడ్లపైకి వచ్చి అనేకసార్లు ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది.

అరకొరగా నిరుద్యోగభృతి

అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి అందిస్తానని ఇచ్చిన హామీని అరకొరగానే అందించారు. ఎన్నో నియమ, నిబంధనలు పెట్టి నాలుగున్నరేళ్ల పాలన గడిచాక ఎన్నికల ముందు అరకొరగా రూ.వెయ్యి ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

జగనన్న వచ్చాకే కొలువుల జాతర

గ్రామస్వరాజ్యం తెచ్చిన సీఎం వైఎస్ జగన్ నిరుద్యోగులు ఎలాంటి ఆందోళనలు చేయకుండానే నోటిఫికేషన్‌లు ఇచ్చారు. సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలందించేందుకు ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేశారు. సుమారు 1200 కుటుంబాలకు ఒక సచివాలయం చొప్పున ఏర్పాటు చేయడంతోపాటు అందులో అడ్మిన్, వీఆర్వో, విలేజ్ సెక్రటరీ, వెల్ఫేర్, డిజిటల్, శానిటరీ, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరీ కల్చర్, సివిల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్, సర్వేయర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖ తదితర ఉద్యోగుల్ని నియమించారు.

నియోజకవర్గంలో 1900 మంది కుటుంబాలకు వెలుగు

ఆదోని నియోజకవర్గంలో 77 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఇందులో అర్బన్‌లో 42, రూరల్‌లో 35 సచివాలయాలు ఉన్నాయి. అర్బన్ సచివాలయాల్లో 420 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండగా 605 మంది వలంటీర్లు ఉన్నారు. రూరల్ సచివాలయాల్లో 455 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండగా 420 మంది వలంటీర్లు ఉన్నారు. వివిధ శాఖల్లో ఉన్న ఖాళీల ఆధారంగా అభ్యర్థుల విద్యార్హతల మేరకు ఆయా విభాగాల్లో కొలువులు లభించాయి. మొత్తంగా 77 సచివాలయాల్లో 875 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 1025 మంది వలంటీర్లు ఉన్నారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నారు.

మా ఇంట్లో వెలుగులు నిండాయి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన సచివాలయ వ్యవస్థతో మా ఇంట్లో వెలుగులు నిండాయి. మా అబ్బాయి కురువ అమరేష్ ఎంఏ, బీఈడీ చదివారు. పొలం పనులు చేసుకుంటూ ఇంటి వద్దే ఉండిపోయాడు. ఇంత చదువు చదివి పొలం పనులు చేయడంతో చాలా ఇబ్బందిగా బాధగా అనిపించేది. ఇంతలోనే సచివాలయ వ్యవస్థ రావడంతో దరఖాస్తు చేసుకుని ఎవరి సిఫారసు, పైసా ఖర్చు లేకుండా ఆదోని పట్టణంలో 25వ వార్డు సచివాలయంలో ఉద్యోగం పొంది వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా పని చేస్తున్నాడు. ఎంతో సంతోషంగా ఉంది. – **జయరాముడు, పత్తికొండ**

కుటుంబం ఆర్థికంగా నిలబడింది



మా అబ్బాయి సందెపోగు దేవానంద్ ఎంఏ, బీఈడీ చదివారు. మాకు ఒక సెంటు భూమి కూడా లేదు. నిరుపేద కుటుంబం. ఉండడానికి కొట్టం కూడా లేదు. జగనన్న వల్ల మా కుటుంబం ఆర్థికంగా నిలబడింది. ఆయన వచ్చిన వెంటనే మాలాంటి నిరుపేదలకు అండగా నిలిచారు. నాకు నలుగురు కుమారులు. కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాం. సచివాలయంలో మా అబ్బాయికి ఉద్యోగం రావడంతో ఆర్థికంగా స్థిరపడ్డాం. ప్రస్తుతం మా అబ్బాయి ఆదోని పట్టణంలోని సచివాలయంలో వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీగా పని చేస్తున్నాడు. ఉద్యోగం వచ్చిన వెంటనే పెళ్లి చేసుకున్నాడు. ఈ ఉద్యోగం వల్ల కష్టాలు తొలగి సంతోషంగా ఉన్నాం.

– **ఈరమ్మ, కోసిగి**

వీధి కుక్కల బెడదను నివారించాలి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీలో సందు సందునా వీధి కుక్కల బెడద తీవ్రమైందని, వాటి బారి నుంచి కాపాడాలని పాలకవర్గ సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో పట్టణంలో వీధికుక్కల స్వైర్యవిహారం, పిల్లలపై దాడులకు తెగబడుతున్నాయని అధికారుల దృష్టికి కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, ఇస్మాయిల్, రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీ తీసుకొచ్చారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో చైర్‌పర్సన్ బోయ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వీధి కుక్కలు బెడద అధికమైందని, రోజుకు 15 నుంచి 20 మందికి పైగానే పిల్లలు దాడులకు గురవుతున్నారని, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నమోదవుతున్న కేసులే అందుకు సాక్ష్యం అని సభ్యులు పేర్కొన్నారు. వీధి కుక్కలను సమస్య పరిష్కరించాలని కోరారు. వేసవికాలం సమీపించిందని, తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు, రాంజల నల్లచెరువును పూర్తి స్థాయిలో నింపుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణం పనులు పూర్తి చేయాలన్నారు. తాగునీటి నిమిత్తం తుంగభద్ర దిగువ కాలువలో రా వాటర్ సరఫరా అవుతున్నాయని, వాటిని చెరువులోకి సామర్థ్యం మేరకు నింపుకున్నట్లయితే ఎండాకాలంలో నీటి సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వీధి దీపాలు వెలగడంలేదని, మరమ్మతులు చేపట్టాలని కౌన్సిలర్లు వసీం, ఇస్మాయిల్, బాలాజీ, రాజేశ్వర్‌రెడ్డి కోరారు. గతంలో ప్రజా సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన జేసీబీ, వాకీటాకీలు ఏమయ్యాయని కౌన్సిలర్లు బాలాజీ, రఘునాథ్‌రెడ్డి ప్రశ్నించారు. ఆస్తి, నీటి పన్ను వసూళ్లలో నష్టాన్ని తగ్గించి పట్టణాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీకి ఏటా కోట్లాది రూపాయల ఆదాయం తీసుకొచ్చే ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్, కమేళా, వారపు సంతల్లో సౌకర్యాలు కల్పిస్తూ వేలం వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వారం, పది రోజుల్లో మార్కెట్ వేలం పాటలు నిర్వహిస్తారని, ఆలోగా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇన్‌చార్జ్ కమిషనర్ అనుపమ, వైస్ చైర్మన్ అబ్దుల్‌గాస్, ఎంఈ చలపతిరావు, డీఈలు, ఏఈలు, కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. గత నెలలో జరిగిన రోడ్డు సేఫ్టీ సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాల్లో భాగంగా ఎమ్మిగనూరు బైపాస్ సమీపంలో నెట్టేకల్ క్రాస్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, ఎమ్మిగనూరు పట్టణం నందవరం వై.జంక్షన్ వద్ద లైటింగ్, ఎమ్మిగనూరు కమిటీ మార్కెట్ సమీపంలో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ సమీపంలో రంబుల్స్ స్ట్రిప్స్ వారంలోపు పూర్తి చేయాలన్నారు. ఎమ్మిగనూరు నుంచి ఎర్రకోట వరకు రోడ్డు మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. ఆదోని నూతన బ్రిడ్జి సమీపంలో సర్వీస్ రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మిగనూరు–ఆస్పరి రోడ్డుకు సంబంధించి లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి వివరాలపై ఆరా తీశారు. ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్కూల్ ఆటోలో పరిమితికి మించి తరలిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్పీ శివనారాయణస్వామి, ఆర్టీఓ నాగేంద్ర, ఎంవీఐ సిసిరాదీప్తి, రోడ్లు, భవనాల శాఖ ఈఈ కృష్ణారెడ్డి, నేషనల్ హైవే ఏఈ శ్రీహరి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, పోలీసు, రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను గురువారం రాత్రి సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ పరిశీలించారు. పట్టణంలోని వెంకన్నపేట, హవన్నపేట, బార్‌పేట, కిల్చినపేట, న్యూబార్‌పేట, కొడలోపేట, శక్తిగుడి, వడ్డేగేరి, హనుమాన్‌నగర్, రాజ రాజేశ్వరినగర్, బాలుర సాంఘిక సంక్షేమ వసతిగృహం, సెయింట్ జోసెఫ్ స్కూల్, పశుసంవర్ధకశాఖ కార్యాలయం, టీబీపీ కార్యాలయం, అర్థగేరి బసవన్నగౌడ్ పురపాలక ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి సౌకర్యాల కల్పనపై సిబ్బందికి సూచనలు చేశారు.

ఉచితంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్



కుంటనహాల్‌లో రిజిస్ట్రేషన్ పత్రాలను అందుకున్న లబ్ధిదారులు

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీలలో మంజూరు చేసిన ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు సర్వ హక్కులు ఉండాలన్న ఉద్దేశంతో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలను అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ గ్రామ ఇన్‌చార్జ్ శివరాం, నాయకుడు రాజప్పగౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కుంటనహాల్ గ్రామంలో గురువారం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామంలో 113 మంది అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చిందని, ప్రస్తుతం వారందరికీ రిజిస్ట్రేషన్ పూర్తిచేసి డాక్యుమెంట్లను అందజేశారు. నవరత్నాల్లో భాగంగా ఇంటి స్థలాలను ఇవ్వడంతో పాటు నిర్మాణానికి సహకారం అందించడం లబ్ధిదారులు చేసుకున్న అదృష్టం అన్నారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామ నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: 2024 డీఎస్సీ వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయులు నరసయ్య, నరసింహులు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. గురువారం పురపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. అనుభవం కలిగిన ఉపాధ్యాయుల చేత ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ తీసుకుంటున్న ప్రతి ఒక్కరికీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నామని, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, రామన్న, ఓబన్న, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులు అందుకున్న లబ్ధిదారులు

ఆదోని సెంట్రల్: ప్రజలందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం సరికొత్త ఆరోగ్యశ్రీ కార్డులను అందిస్తోంది. అందులో భాగంగా గురువారం పట్టణంలోని 35వ వార్డులో వలంటీర్లు పరుశురాముడు, నూర్ బాషా, షరీఫ్ తదితరులు లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. వార్డులో 1303 మంది లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరుకాగా వాటిని వార్డు ఏఎన్‌ఎం ఈరమ్మతో కలిసి ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. గతంలో కేవలం తెల్ల రేషన్‌కార్డుదారులు మాత్రమే ఈ పథకం పరిధిలోకి వచ్చేవారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో రూ.5 లక్షలలోపు వార్షికాదాయం ఉన్న మధ్య తరగతి కుటుంబాలను కూడా ఈ పథకంలోకి చేర్చారు. ఈ పథకం కింద వైద్య సేవల పరిమితిని రూ.5 లక్షలు నుంచి రూ.25 లక్షల వరకు పెంచడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బకాయిలను విడుదల చేయాలి

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయ, ఉద్యోగస్తులకు పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యలయం ముందు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. 11వ పీఆర్‌సీ బకాయిలను విడతల వారీగా కాకుండా ఏకమొత్తంలో చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు కొత్త డీఏలను విడుదల చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘురామయ్య, గౌరవాధ్యక్షులు తిక్కస్వామి, జిల్లా కార్యదర్శి భీమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరినామ ప్రచార కేంద్రం ప్రారంభం

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని ఎమ్మిగనూరు బైపాస్ వద్ద గార్డేనియా విల్లాస్‌లో హరినామ ప్రచార కేంద్రాన్ని ఇస్కాన్ వారు గురువారం ప్రారంభించారు. తిరుపతి ఇస్కాన్ సంస్థ నిర్వాహకులు, భక్తులు కేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా రాధాకృష్ణ విగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఇస్కాన్ భక్తులు హరినామ సంకీర్తనలు, భక్తి భజనలు చేశారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. తిరుపతి ఇస్కాన్ నిర్వాహకుడు రూపానంద స్వామి మాట్లాడుతూ హరినామ ప్రచారం ఆదోని పట్టణంలో ప్రారంభిస్తామన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఆదోని సెంట్రల్: నేటి నుంచి ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు ఆ విభాగం ఇన్‌చార్జ్‌లు ప్రకాశ్‌రావు, యల్లప్ప, బాలరాజు, రాజు అధ్యాపకులు గురువారం అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2 సెంటర్లు, సాయి జూనియర్ కళాశాల, బాలాజీ జూనియర్ కళాశాల, అక్షర శ్రీ జూనియర్, ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్, నారాయణ కళాశాల మొత్తం 7 సెంటర్లను ఏర్పాటు చేశారు. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు రోజు మార్చి రోజు పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు పరీక్షలను నిర్వహిస్తారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఉదయం 8.30 గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు.

నేడు గిరక బండి పోటీలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో భూగేని చెరువు సమీపంలో శుక్రవారం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో మండల స్థాయి ఎద్దుల గిరకబండి లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్స్ శ్రీరామ్, లక్ష్మీరెడ్డి, బాబు తెలిపారు. ఎల్లమ్మ జాతర పురస్కరించుకుని రెండవ రోజున గ్రామంలో గిరకబండి పోటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విజేత వృషభాల యజమానులకు వరుసగా రూ.21 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు అందించనున్నట్లు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం



బాధితులకు ఆర్థిక సహాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ యువనేత సాయికిరణ్ రెడ్డి

పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో ప్రమాదవశాత్తు గడ్డివాములు కాలిపోయిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. సర్పంచ్ పింజరి దస్తగిరి, ఉచ్చప్ప, ఉసేని, దేవనకొండ నరసింహులు, నారాయణకు సంబంధించిన 5 గడ్డివాములకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు వాపోయారు. రూ.3 లక్షల విలువైన పశుగ్రాసం కాలిబూడిదైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సాయికిరణ్‌రెడ్డి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. స్థానిక బోరుకు మోటారు ఏర్పాటు చేసి గ్రామస్తుల సాయంతో మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. అనంతరం బాధితులకు రూ.30 వేలు ఆర్థిక సహాయం చేశారు.

గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

కౌతాళం: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయం అని ఆ పార్టీ బాపురం గ్రామ ఇన్‌చార్జ్ గురనాథ్‌రెడ్డి, నాయకుడు జైపాల్ అన్నారు. మండల పరిధిలోని బాపురం గ్రామంలో ఎంపీపీ నిధులు రూ.5 లక్షలతో గ్రావెల్ రోడ్డు పనులకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని అంపయ్య దేవాలయం నుంచి వీరలదిన్నెకు పోయే రస్తా వరకు ఇరువైపులా ముళ్లకంపలు తొలగించి గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రస్తాలో ముళ్లకంపలు పెరిగిపోయి వీరలదిన్నెకు పోవడానికి, అలాగే రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని, సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి మండల పరిషత్ గ్రాంట్ నుంచి నిధులు మంజూరు చేయించడంతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామంలో పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అభివృద్ధి కొనసాగాలంటే రాబోవు ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకే ఓటు వేయాలని కోరారు. నాయకులు దివాకర్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, గిరిస్వామి, నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రేణుకా ఎల్లమ్మ రథోత్సవం



అశేష భక్తజనం మధ్య మహా రథోత్సవం

కోసిగి: మండల ప్రజల ఆరాధ్య దైవం, కొలిచే వారి కొంగుబంగారంగా విరజిల్లుతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి మహా రథోత్సవం గురువారం సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. మాఘ మాసం పంచమి పురస్కరించుకుని వేకువజామున అమ్మవారికి విశేష పూజలు చేపట్టి మహామంగళ హారతులు గావించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తాదులు అమ్మ వారి దర్శనం కోసం క్యూ కట్టారు. కోసిగితో పాటు జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచే గాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి కుడుములు గుగ్గిళ్ల నైవేద్యం, నారికేలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చర్మ వాధులు ఉన్న వారు మొక్కుబడిగా కేజీ పాపు ఉప్పు అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. సాయంత్రం సాంప్రదాయబద్ధంగా మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణరాజు దొర ఇంటి నుంచి ఆయన కుమారులు శ్రీనివాసరాజు దొర, మురళీ దొర ఆధ్వర్యంలో పూర్ణకుంభాన్ని కలశాలు, మేళాతాళాలు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేర్చి రథానికి పూజలు చేశారు. అనంతరం అమ్మ వారి ఉత్సవమూర్తిని రథంపై కొలవుంచి ఆలయం నుంచి మహా రథోత్సవం నిర్వహించారు. అమ్మవారి పాదాల చెంత వరకు రథాన్ని లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు అరటి పళ్లు విసిరి మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్ రెడ్డి, మండల ఇన్‌ఛార్జ్ పి. మురళీమోహన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, ట్రైనీ డీఎస్పీ భావన ఆధ్వర్యంలో కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్‌కుమార్ సమక్షంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ బెట్టన గౌడ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత వైఎస్సార్ జిల్లా జట్టు



విజేత జట్టుకు నగదు బహుమతి అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: రేణుకా ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి సహకారంతో స్థానిక మౌంట్ కార్మెల్ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెవెన్స్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నీలో వైఎస్సార్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. గురువారం స్థానిక పాఠశాలలో కోసిగి ఎంసీఎస్‌ఎఫ్‌సీ బీ టీమ్, కడప జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా జరిగింది. ఇందులో కోసిగి జట్టుపై వైఎస్సార్ జిల్లా జట్టు గెలుపొందింది. విజేతకు రూ.30 వేలు, రన్నరప్‌కు రూ.20 వేలు, తృతీయ బహుమతి కోసిగి ఎంసీఎస్‌ఎఫ్‌సీ జట్టుకు రూ.10 వేలు నగదును ఎమ్మెల్యే తరపున ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మాణిక్యరాజు, బుళ్లి నరసింహులు అందజేశారు. క్రీడాకారులకు నూర్ అహ్మద్ కప్ అందించారు. ఆర్గనైజర్స్ ప్రశాంత్, వేణు, భరద్వజ, సతీష్‌లు పాల్గొన్నారు.